క్లుప్తంగా

27 నుంచి కంప్యూటర్ ట్రైనింగ్ సమ్మర్ క్యాంప్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ ట్రైనింగ్ కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మర్ కంప్యూటర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహించనున్నట్లు కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి టీ క్రాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, కోరల్ డ్రా, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 45 రోజుల పాటు క్లాసులు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు పూర్తవుతున్న నేపథ్యంలో వేసవి సెలవుల్లో కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ లోగా ఆసక్తి కలిగిన వారు రాఘవయ్య పార్కు సమీపంలోని తమ కార్యాలయంలో గానీ, 90145 41958, 73821 93413 నంబర్లలో గానీ సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడకు చెందిన శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీకి చెందిన కళాబృందం నృత్య నీరాజనాలను అర్పించింది. నాట్యాచార్య చింతా వెంకట శివరామకృష్ణకుమార్ ఆధ్వర్యంలో 25మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.

సెలవు రోజుల్లో పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీస్థలాలు, నీటి పన్ను చెల్లింపులు సెలవు దినాల్లో కూడా చెల్లించవచ్చని, క్యాష్ కౌంటర్లు అందుబాటులోనే ఉంటాయని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ పన్నులను వీఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్ని క్యాష్ కౌంటర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు నగర ప్రజలు తమ తమ అసెస్మెంట్లకు ఉన్న పన్నులు త్వరితగతిన చెల్లించి, వడ్డీ లేకుండా సకాలంలో చెల్లించాలని కోరారు. ఎక్కువ కాలం నుంచి పన్నులు చెల్లించని వారికి డ్రెయినేజ్ కనెక్షన్, తాగునీటి కనెక్షన్ తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

దుర్గమ్మ సన్నిధిలో సంగీతార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వనిత సురేష్ బృందం శనివారం సంగీతార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై వనితి సురేష్ గాత్రకచేరీ భక్తులను విశేషంగా అలంకరించింది. వనిత సురేష్‌కు మల్లాది శివానంద్ మృదంగంపై, సింధు రాగేశ్వరి వయోలిన్‌పై వాద్య సహకారం అందించారు. సుమారు మూడు గంటలపాటు సాగిన సంగీత కచేరీలో పలు అమ్మవారి కీర్తనలను ఆలపించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కళావేదిక వద్దకు చేరుకుని సంగీతార్చనను ఆస్వాదించారు. అనంతరం సంగీతార్చన నిర్వహించిన బృందానికి ఆలయ అర్చకులు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ డీఈవో రత్నరాజు అందచేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): మనం పని చేసే ప్రదేశంతోపాటు, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుదామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. స్వర్ణ ఆంధ్రా–స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని శనివారం ఆమె చేపట్టారు. ఇందులో భాగంగా కార్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత వస్తువులనే వినియోగిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, గణాంక అధికారి లక్ష్మోజీ, ఆఫీసు సూపరింటెండెంట్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ పేరుతో అక్రమ వసూళ్లు

- కారుకు గంటకు రూ.100వసూలు
- 2 గంటలు మించితే రూ.500
- అమ్మవారి భక్తుల నుంచి దోపిడీ
- దోపిడీదారులతో అధికారుల కుమ్మక్కు
- వీఎంసీ ఆదాయానికి భారీగా గండి



38వ డివిజన్ పరిధిలో ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసిన వాహనాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి కార్లలో వచ్చే భక్తులను కొంతమంది వ్యక్తులు పార్కింగ్ ఫీజు పేరుతో దోచుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో ఉన్న పార్కింగ్ ఫీజు రసీదు ఇస్తుండటంతో భక్తులు సైతం నిజమే కామోసు అనుకుంటూ డబ్బులు చెల్లిస్తుండటం గమనార్హం.

అనధికార వసూళ్లకు కళ్లెమేది?..

పశ్చిమ నియోజకవర్గం వన్‌టౌన్ ప్రాంతంలోని వినాయకుడి గుడి వద్ద (కెనాల్ రోడ్) నుంచి ఏలూరు లాకుల వరకు (37వ డివిజన్ పరిధి) పార్కింగ్ ఫీజు వసూలు నిమిత్తం నగరపాలక సంస్థ పిలిచిన టెండర్‌ను ఓ వ్యక్తి పాడుకున్నారు. పార్కింగ్ ఫీజు మొత్తాన్ని పేర్కొంటూ మున్సిపల్ కార్పొరేషన్ పేరు మీద రసీదులు ముద్రించుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా పరిధులు దాటి 38వ డివిజన్ పరిధిలో పార్కింగ్ చేసిన వాహనాల దగ్గర కూడా అదే రసీదు స్లిప్‌ను ఉపయోగిస్తూ అనధికారికంగా ఫీజు వసూలు చేస్తున్నారు.

పార్కింగ్ ఫీజు వసూలుకు పాడుకున్న ప్రాంతానికి ఆవతల కూడా పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రిడ్జి కింద నోపార్కింగ్ బోర్డు పెట్టిన ప్రాంతంలోనూ వాహనాలను పార్కింగ్ చేయిస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించిన పరిధి దాటి ఇష్టారాజ్యంగా సాగుతున్న ఈ అక్రమ వసూళ్లపై స్థానిక భక్తులు మండిపడుతున్నారు. సదరు కాంట్రాక్టర్, కొందరు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై దందా నడిపిస్తున్నారని విమర్శిస్తున్నారు.

టీడీపీ నాయకుడికి ముడుపులు..

పార్కింగ్ ఫీజు వసూలుకు నిర్ణయించిన ప్రాంతమే కాకుండా 38వ డివిజన్ పరిధిలోని బొడ్డురాయి బొమ్మ సెంటర్ ప్రాంతం మొదలుకుని మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వరకు కూడా అదే రసీదు ఇచ్చి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని భక్తులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు రూ.20వేలు, శుక్రవారం, పండుగ దినాలు, దసరా ఉత్సవాల సమయాల్లో(12 రోజులు) రోజుకు సుమారు రూ.50 వేలు వసూలవుతున్నట్లు సమాచారం. ఇలా అక్రమ పార్కింగ్ ఫీజు వసూళ్ల సొమ్ము అంతా కాంట్రాక్టర్ జేబులోకి వెళ్తుండగా, నగరపాలక సంస్థ ఆదాయానికి మాత్రం పెద్దఎత్తున గండి పడుతోంది. ఇలా వసూలు చేసిన మొత్తంలో స్థానికంగా ఉంటున్న ఓ టీడీపీ నాయకుడు, సంబంధిత అధికారులకు నెలవారీ ముడుపులు అందుతున్నట్లు సమాచారం. కారు పార్కింగ్ ఫీజు పేరుతో గంటకు రూ.100, రెండు గంటలు దాటితే రూ.500 వసూలు చేస్తుండటం గమనార్హం. ఈ విషయమై పలు ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సదరు ప్రైవేట్ వ్యక్తులతో నగరపాలక సంస్థ అధికారులు కుమ్మక్కు అయ్యారనే ప్రచారం ఈప్రాంతంలో జోరుగా సాగుతోంది. బాధితులు పార్కింగ్ దందా గురించి విద్యాధరపురం 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా దృష్టికి తీసుకురావడంతో ఆమె ఇటీవల మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి అనధికార అక్రమ పార్కింగ్ ఫీజును నిలుపుదల చేయాలని వినతి పత్రం అందజేయడం గమనార్హం. అయినప్పటికీ పరిస్థితి మాత్రం యథా అధికారులు..తథా అక్రమ వసూళ్లదారులు అన్న చందాన మారిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి 38వ డివిజన్ పరిధిలోని ప్రాంతానికి కూడా టెండర్ పిలిచి అక్రమ వసూళ్ల దందాకు తెర దించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



బొడ్డురాయి బొమ్మ సెంటర్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు



పార్కింగ్ పేరుతో రశీదులు ఇచ్చి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి (ఎరుపు చొక్కా)

కనులపండువగా నగరోత్సవం



స్వామివారి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీవేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా సాగింది. కొత్తపేట వేణుగోపాలస్వామి చౌక్ (నెహ్రూబొమ్మ సెంటర్)లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా రెండురోజులుగా స్వామి సన్నిధిలో పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత కల్యాణవేదికపై సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలుని ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించి మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర కార్యక్రమాలు కల్యాణోత్సవాన్ని ముగించారు. అదేవిధంగా స్వామివారికి శనివారం నగరోత్సవాన్ని నిర్వహించారు. రమణీయంగా అలంకరించిన వాహనంపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామి వారి నగరోత్సవాన్ని ప్రారంభించారు. నగరోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై బ్రాహ్మణవీధి, కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉత్సవంలో భాగంగా ఆలయంలో వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేంచేసిన శ్రీ స్వయంబు శ్రీవల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం గోపూజ, 8గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధన, నవగ్రహ మండపారాధన, చతుర్ధ కలశ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్ద స్వామివారిని అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమాలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు దంపతుల పర్యవేక్షణలో గాడే సురేంద్రరెడ్డి దంపతులు, మాజీ కార్పొరేటర్ కొరికాని అనురాధ, మల్లేశ్వరరావులతోపాటు ఉభయదాతలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



41వ డివిజన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఇర్ఫాన్, హెలెన్, ఉమర్ అలీ, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో భాగంగా 38వ డివిజన్‌లోని 113వ వార్డ్ సచివాలయం పరిధిలోగల కనకదుర్గనగర్, బ్రాహ్మణ వీధి, మల్లికార్జునపేట ప్రాంతాలను శనివారం శుభ్రం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ సోమశేఖరరెడ్డి, శానిటరీ ఇనస్పెక్టర్ సురేంద్ర, రాజస్థానీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి..

ఇంటి పరిసరాలు, పరిశుభ్రతపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగిఉండాలని 41వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్ సూచించారు. నగరపాలక సంస్థ ఏసీ–1 హెలెన్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఎస్ఎమ్ఎ ఖుద్దూస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని, పరిశుభ్రతను కచ్చితంగా అమలు చేస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమర్‌అలీ, సచివాలయం సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ రెహమతున్నీసా, విద్యార్థులు

ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం : మేయర్



ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యాన్యచంద్ర, కార్పొరేటర్లు



దుర్గగుడి ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆలయ సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పంజాసెంటర్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో విజయవాడ నగరం దేశంలోనే అత్యుత్తమ స్థానాన్ని సాధించిందని, ఇందులో ప్రజల భాగస్వామ్యమే కీలకమని పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లో కూడా పారిశుద్ధ్య కార్మికులు అహర్నిశలు శ్రమిస్తూ విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారంటూ వారిని అభినందించారు. ప్రజలంతా పర్యావరణహితమైన సంచులను వినియోగించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించామని, ప్రజలంతా గుడ్డ సంచులు, జూట్ సంచులను వాడాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను డ్రెయిన్లో పడేస్తున్నారని, అవి మురుగు పారుదలకు ఆటంకం కలిగిస్తున్నాయనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. అనంతరం ప్రజలు మలేరియా బారిన పడకుండా ఉండేందుకు విజయవాడ నగరపాలక సంస్థ వారు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను అతిథులు పరిశీలించారు. అనంతరం ర్యాలీ ద్వారా పంజాసెంటర్‌లోని వ్యాపారులు, ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కల్పించారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ వారు పెట్టిన ప్రత్యేక స్టాల్‌ను వీక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబ్దుల్ అకిబ్ అర్షద్, ఉమ్మిడి వెంకటేశ్వరరావు, బోయి సత్యబాబు, మరుపిళ్ళ రాజేష్, మహదేవు అప్పాజీరావు, అధికారులు అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, సూపరిండెంటింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, అసిస్టెంట్ ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గ గుడి ప్రాంగణంలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గగుడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ డీఈవో రత్నరాజు ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగించకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో చంద్రశేఖర్, సుధారాణి, దుర్గారావు, జంగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్‌లో..

స్థానిక 46వ డివిజన్‌లోని కలరా హాస్పటల్ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్కిల్–1 అధికారులు, సిబ్బందితోపాటు స్థానికంగా ఉన్న పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత సర్కిల్–1 కార్యాలయం నుంచి లంబాడీపేట సాయిరాం థియేటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేఎల్‌రావునగర్ వీఎంసీ కాలనీ వద్ద విద్యార్థులు, కార్పొరేషన్ సిబ్బందిచే మేయర్ భాగ్యలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

23న ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం మహాసభ



పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆటో, మోటారు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తమ సంఘం 12వ నగర మహాసభను ఈ నెల 23వ తేదీన బందరురోడ్డు రాఘవయ్య పార్కు సమీపంలో ఉన్న మాకినేని బసవపున్నయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షుడు డీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడను ఆటోలకు ఎటువంటి ఆంక్షలు లేని ఫ్రీ జోన్‌గా చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఏవిధమైన పోరాటాలు చేయాలనే విషయాలపై ఈ మహాసభల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు డీ శ్రీధర్‌బాబు, పింగళి రమణ, రఫీఖాన్, యాదగిరి, సుబ్బారావు, వలి తదితరులు పాల్గొన్నారు.

700 మందికి వైద్యపరీక్షలు



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వసంత కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛందసంస్థలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సహకారంతో విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం గొల్లపూడిలో గల శ్రీదత్త కల్యాణ మండపలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది పాల్గొని 700మందికి గుండె జబ్బులు, మెదడు, నరాల వ్యాధులు, థైరాయిడ్, జీర్ణకోశ వ్యాధులు తదితర పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఇసీజీ, 2డి ఎకో స్క్రీనింగ్, పీఎఫ్‌టీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త, రోటరీ క్లబ్ పాస్ట్ గవర్నర్ ఎమ్‌సీ దాస్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి అధ్యక్షులు ఎం. దుర్గారావు, కార్యదర్శి మద్దాలి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ఆర్‌వీ సుబ్బారావు, స్థానిక టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నారద, నగ్రా వాసు, బీజేపీ నాయకుడు నూతులపాటి బాల, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగా విగ్రహాలను ఉచితంగా అందిస్తాం : బుజ్జి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మండల కేంద్రాల్లో ప్రతిష్టించేందుకు దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు విగ్రహాలను తమ ట్రస్ట్ తరుపున ఉచితంగా అందజేస్తామని ఆంధ్ర–తెలంగాణ రాధా రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి తెలిపారు. విద్యాధరపురంలోని వీఎమ్ రంగా జంక్షన్‌లో ఉన్న రంగా విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ ట్రస్ట్ తరపున 149 రంగా విగ్రహాలను ఉచితంగా అందించామని తెలిపారు. విగ్రహాలు కావలసినవారు సంప్రదించాలని ఆయన కోరారు.

గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ శర్మ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గుండె సంబంధిత వ్యాధుల విషయంలో అందరూ అప్రమత్తత కలిగి ఉండటం ద్వారా ప్రాణాపాయాన్ని తప్పించుకోవచ్చని ప్రముఖ వైద్యులు పి.వి.ఆర్.ఎస్. సుబ్రహ్మణ్య శర్మ సూచించారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం గుండె జబ్బులు, అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శర్మ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు ముసలివారికి మాత్రమే వస్తాయనేది అపోహ మాత్రమేనన్నారు. 20ఏళ్ల యువత గుండెపోటుకు గురవుతున్న సంఘటనలు తరచూ చూస్తున్నామన్నారు. రోజూ వ్యాయామం, యోగా, నడకకు తగిన సమయం కేటాయించాలని సూచించారు. దూమ, మద్య పానం అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వీ నారాయణరావు, పీవో ఎన్.సాంబశివరావు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకుడు శాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా యువతికి అరుదైన గుండె శస్త్రచికిత్స



మీడియా సమావేశంలో రోగితో పాటు వైద్య బృందం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పుట్టుకతోనే క్లిష్టతరమైన గుండె సమస్యలున్న ఒడిశాకు చెందిన 26 ఏళ్ల యువతికి విజయవాడలోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో క్లిష్టతరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్ జిల్లాకు చెందిన రీనాకు సెన్నింగ్ రిపేర్, కరెక్టెడ్ ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ ది గ్రేట్ ఆర్టరీస్, గుండె రక్తప్రవాహ మార్గాలు తప్పుగా అనుసంధానమై ఉన్నట్లు గుర్తించారు. ఇలా పలు సమస్యలున్న యువతికి క్లిష్టతరమైన శస్త్రచికిత్సను 12 గంటల పాటు శ్రమించి విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇది అత్యంత అరుదైన శస్త్రచికిత్స అని తెలిపారు. సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతిప్రకాష్, డాక్టర్ కే అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోగల 11కేవీ కామకోటినగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఆదివారం రెండుగంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పీ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జోజినగర్, లక్ష్మీనగర్ కాలనీ, ఫిలథెల్ఫియా చర్చి రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్ తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు.

భవానీపురం టీచర్స్ కాలనీ పరిధిలో

భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఆదివారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు టీచర్స్ కాలనీ, హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని అప్పాబజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, వెలంపల్లి నగర్‌లోని 450 ఎస్ఎఫ్‌టీ బ్లాకులు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.